పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మహా శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పెగడపల్లి, ఫిబ్రవరి 28: మండలకేంద్రంలోని స్వయంభూ శ్రీరాజ రాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను బుధవారం ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్చి 6 నుంచి 9 వరకు 4రోజుల పాటు నిర్వహించే స్వామి వారి ఉత్సవాలకు సంబంధించి ఆలయంలో అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

రెవెన్యూ అడిషనల్ కలెక్టర్‌గా రాంబాబు

● రెవెన్యూ అడిషనల్ కలెక్టర్‌తో సహా ఇద్దరు ఆర్డీవోల బదిలీలు

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 28: జగిత్యాల రెవెన్యూ అడిషనల్ కలెక్టర్‌గా పర్శ రాంబాబుకు పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా విధులు నిర్వహిస్తున్న బీఎస్ లతను సూర్యాపేట అడిషనల్ కలెక్టర్‌గా, భద్రాద్రి కొత్తగూడెం రెవెన్యూ అడిషనల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పర్శ రాంబాబును జగిత్యాలకు బదిలీ చేశారు. జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తిని బ్రాహ్మణపరిషత్ అడ్మినిస్ట్రేటర్‌గా, వేములవాడ ఆర్డీవో మధుసూదన్‌ను జగిత్యాల ఆర్డీవోగా, కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్‌ను వేములవాడకు, సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్‌ను కోరుట్లకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పలువురు సీఐల బదిలీలు

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 28: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల టౌన్ సీఐ నటేశ్ సస్పెన్షన్ కాగా, ఆయన స్థానంలో రామగుండం కమిషనరేట్ ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూరం శ్రీనివాస్‌కు పోస్టింగ్ ఇవ్వగా, కోరుట్ల సీఐ మద్దినేని ప్రవీణ్‌కుమార్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో బి. సురేశ్ బాబును నియమించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మల్యాల సీఐ దామోదర్‌రెడ్డిని బదిలీ చేసి ఏసీబీ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నీలం రవికి మల్యాల సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. మల్యాల సీఐగా బదిలీపై వచ్చిన దామోదర్‌రెడ్డి నెలలోనే బదిలీ కాగా, ఆయన స్థానంలో పోస్టింగ్ పొందిన రమేశ్ గతంలో మల్యాల, కొడిమ్యాల ఠాణాల్లో ఎస్ఐగా విధులు నిర్వహించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319447-All

PLOT FOR SALE
★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, మౌంట్ ఒపేర, గ్రీన్ సిటీ, సుచిరిండియాలో ప్లాట్లు కొనబడును. నో Brokrs. 9553973999 / 6303049720.
NT-313892

CHANGE OF NAME
★I, CHINTA KRANTHIKUMAR, R/o. 7-1-740/2, Mankammathota, Karimnagar, TS, have Changed My Name CHINTHA KRANTHI KUMAR, S/o. Bairaiah.
NT-311641

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో..
కాంగ్రెస్, బీజేపీ కుట్ర

- బీఆర్ఎస్ విప్‌ను ధిక్కరించిన 9 మందికి మద్దతు
- చైర్‌పర్సన్‌గా తిరుగుబాటు అభ్యర్థి అడువాల జ్యోతి
- ఒక్క ఓటు తేడాతో విజయం
- విజయం సాధించగానే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇంటికి జ్యోతి
- కుటుంబ సభ్యులను కలిసి ధన్యవాదాలు
- గులాబీ శ్రేణుల ఆగ్రహం.. కలెక్టర్‌కు ఫిర్యాదు

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇంట్లో కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులతో అడువాల జ్యోతి

జగిత్యాల, ఫిబ్రవరి 28, (నమస్తే తెలంగాణ)/జగిత్యాల అర్బన్: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి చెందిన కౌన్సిలర్లు ఒక్కటయ్యారు. విప్‌ను దిక్కరించిన పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లకు స్వతంత్ర సభ్యులతో కలిసి మద్దతు పలికారు. బుధవారం జగిత్యాల మున్సిపల్ ఆఫీస్ మీటింగ్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎన్నిక జరిగింది. మెజార్టీ కౌన్సిలర్లు ఉన్న బీఆర్ఎస్ సునాయసంగా చైర్‌పర్సన్ పదవిని దక్కించుకుంటుందని అందరూ భావించిన తరుణంలో తొమ్మిది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి కుట్ర చేశారు. ఈ క్రమంలో వారు విప్‌ను ధిక్కరించగా, స్వతంత్రులతో కలిసి మద్దతు పలికారు. దీంతో చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ తిరుగుబాటు అభ్యర్థి అడువాల జ్యోతి అనుహ్యంగా ఒక్క ఓటుతో విజయం సాధించారు.

జగిత్యాల మున్సిపాలిటీలో బలబలాలు..

జగిత్యాల టౌన్‌లో 48 వార్డులుండగా, బీఆర్ఎస్ పూర్తి స్థాయి ఆధిక్యం కలిగి ఉంది. గత ఎన్నికల్లో 30 మంది సభ్యులు గెలిచారు. ఏడింట కాంగ్రెస్, మూడు వార్డుల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచారు. ఫార్వర్డ్ బ్లాక్, ఎంఐఎం పార్టీలు ఒకొక్క వార్డులో, మరో ఆరు వార్డుల్లో స్వతంత్రులు గెలిచారు. ఎన్నికల తర్వాత ఫ్వార్వర్డ్ బ్లాక్ నుంచి గెలిచిన కౌన్సిలర్‌తోపాటు ఐదుగురు స్వతంత్రులు బీఆర్ఎస్ గూటికి చేరారు. ఇక బీజేపీలో గెలిచిన ముగ్గురిలో ఒక్క కౌన్సిలర్ సైతం బీఆర్ఎస్‌లో ఇటీవలే చేరారు. దీంతో కౌన్సిల్‌లో బీఆర్ఎస్ బలం 36కు చేరింది. అయితే జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి బీసీ మహిళకు రిజర్వు కావడంతో భోగ శ్రావణిని చైర్‌పర్సన్‌గా నియమించింది. అయితే 2023 జనవరిలో శ్రావణి బీఆర్ఎస్‌కు, కౌన్సిలర్ స్థానానికి రాజీనామా చేసి, బీజేపీలో చేరారు. ఈ క్రమంలో వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి చైర్‌పర్సన్ బాధ్యతలు అప్పగించారు. అయితే 2019 స్థానిక సంస్థల చట్టం ప్రకారం కౌన్సిల్‌లో ఒక్క స్థానం ఖాళీగా ఉన్నా చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించేందుకు వీలు లేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చట్టంలో మార్పులు చేసింది. ఈ క్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా, బీఆర్ఎస్‌లో చైర్‌పర్సన్ పదవిని కౌన్సిలర్లు అడువాల జ్యోతి, సమిండ్ల వాణి ఆశించారు. మున్సిపల్ ఎన్నికలోల పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించి, మళ్లీ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్న వల్లెపు రేణుక సైతం ఆశించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు ఇతర పార్టీ పెద్దలతో చర్చించి, సమిండ్ల వాణిని అభ్యర్థిగా ప్రకటించారు.

ఒక్క ఓటు తేడాతో జ్యోతి గెలుపు...

జగిత్యాల జడ్పీ సీఈఓ గౌతమ్‌రెడ్డి రిటర్నింగ్ అధికారిగా చైర్‌పర్సన్ ఎన్నికను బుధవారం నిర్వహించారు. ఈ క్రమంలో పార్టీ బీఫాంపై గెలిచిన 29 మంది కౌన్సిలర్లకు బీఆర్ఎస్ విప్‌ను జారీ చేసింది. విప్ కాపీలను ఎన్నికల అధికారులతో పాటు, పార్టీ కౌన్సిలర్లకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అందజేశారు. సరిగ్గా 11 గంటల వరకు సమావేశ మందిరంలోకి 46 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. బోగ శ్రావణి రాజీనామాతో ఒక్క కౌన్సిలర్ స్థానం ఖాళీగా ఉండగా, 19వ వార్డు కౌన్సిలర్ ముస్కు నారాయణరెడ్డి విదేశాల్లో ఉండడంతో హాజరు కాలేదు. 46 మంది సభ్యులతో పాటు, ఎక్స్ అఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కలిపి మొత్తం 47 మంది సభ్యులు సమావేశంలో హాజరు కావడంతో ఎన్నికల అధికారి ఎన్నికను చేపట్టారు. బీఆర్ఎస్ తరపున కౌన్సిలర్ సమిండ్ల వాణి నామినేషన్ చేశారు. ఆమెను కౌన్సిలర్లు ఆవారి శివ కేసరి బాబు ప్రతిపాదించగా, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ బలపర్చారు. అయితే అనూహ్యంగా అడువాల జ్యోతి సైతం చైర్‌పర్సన్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. జ్యోతిని స్వతంత్ర కౌన్సిలర్లు అయిన గుగ్గిళ్ల హరీశ్ ప్రతిపాదించగా, మరో స్వతంత్ర కౌన్సిలర్ అయిన వల్లెపు రేణుక బలపర్చారు. జ్యోతి సైతం బీఆర్ఎస్ అభ్యర్థిగా పేర్కొంటూనే నామినేషన్ వేశారు. అయితే పార్టీ బీఫాం సమిండ్ల వాణికి ఇవ్వడంతో ఆమెనే అభ్యర్థిగా ఎన్నికల అధికారి ప్రకటించారు. రెండు నామినేషన్లు రావడంతో ఎన్నికల అధికారి ఎన్నికను చేపట్టారు. బీఆర్ఎస్ అభ్యర్థి సమిండ్ల వాణికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఓటుతో కలిపి 23 ఓట్లు వచ్చాయి. అటు తర్వాత అడువాల జ్యోతికి ఓటు వేసేవారు చేతులు ఎత్తమని కోరగా, కాంగ్రెస్, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థుల్లో కొందరితో కలుపుకొని 9 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు చేతులు ఎత్తడంతో ఆమెకు మొత్తం 24 ఓట్లు వచ్చాయి. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అడువాల జ్యోతి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జడ్పీసీఈఓ గౌతంరెడ్డి ప్రకటించి, పత్రం అందజేశారు.

కలిసిపోయిన కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన కౌన్సిలర్లు కలిసిపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. బీఆర్ఎస్‌కు చెందిన అడువాల జ్యోతి పార్టీ ఆదేశాలను ధిక్కరించి నామినేషన్ వేయడం, ఆమెకు మొన్నటి వరకు బీఆర్ఎస్‌తోనే కలిసి తిరిగిన స్వతంత్ర కౌన్సిలర్లు ప్రతిపాదించి, బలపర్చడం అందరినీ విస్మయానికి గురి చేస్తే, ఎన్నిక సమయంలో కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు, ఇద్దరు బీజేపీ, ఐదుగురు స్వతంత్ర కౌన్సిలర్లు, ఎంఐఎం, ఫార్వర్డ్ బ్లాక్‌లకు చెందిన ఒకొక్క కౌన్సిలర్ మద్దతు పలుకడం ఆశ్చర్యానికి గురిచేసింది. దీనికి తోడు తొమ్మిది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు బండారి రజని, చుక్క నవీన్‌కుమార్, దాసరి లావణ్య, అడువాల జ్యోతి, షబ్నమ్ తరున్నం, అల్లె గంగాసాగర్, సిరికొండ పద్మ, చదువుల తిరుపతమ్మ, సిరికొండ భారతి పార్టీ నిర్ణయాన్ని కాదని, విప్‌ను ధిక్కరించడంతో బీఆర్ఎస్ శ్రేణులు సైతం బిత్తరపోయాయి. దాసరి లావణ్య, చుక్క నవీన్, భారతి గోవాకు క్యాంపునకు వెళ్లి, వచ్చి సైతం పార్టీ ఆదేశాలకు వ్యతిరేకంగా ఓటు వేయడం గమనార్హం.

బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆగ్రహం..

పార్టీకి ద్రోహం చేసి, ఇతర పార్టీల సహకారంతో అధికారం దక్కించుకున్నవారితో పాటు, ప్రలోభాలకు లొంగిపోయిన వారిపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ఐదేండ్లుగా అన్ని విధాలుగా కౌన్సిలర్లను ఆదుకున్నదని, అన్ని విషయాలు మరిచిపోయి ఈ రోజు పార్టీకి ద్రోహం చేయడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఎన్నిక ముగిసిన తర్వాత ఊహించని ఫలితం రావడంతో పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్న కౌన్సిలర్లు ఆగ్రహంతో సమావేశ మందిరం నుంచి బయటకు వచ్చారు. పార్టీకి ద్రోహం చేసిన వారిని అక్కడే విమర్శించారు. విప్‌ను ధిక్కరించిన వారిని అనర్హులుగా ప్రకటించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన జ్యోతి..

ఎన్నిక అనంతరం కాంగ్రెస్, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో గెలిచిన అడువాల జ్యోతి, మున్సిపల్ కార్యాలయం నుంచి నేరుగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. జీవన్‌రెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులకు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, తదితర కాంగ్రెస్ నాయకులకు జ్యోతి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొరవ తీసుకొని, మున్సిపల్ చట్టంలో మార్పు తెచ్చి, చైర్‌పర్సన్ ఎన్నికకు మార్గం సుగమం చేయించారని, ఈ క్రమంలోనే తనకు అవకాశం లభించిందన్నారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్సీకి ధన్యవాదాలు చెప్పడానికి వచ్చినట్లు జ్యోతి తెలిపారు.

అటవీ సంపదను కాపాడాలి: సీసీఎఫ్

మల్యాల, ఫిబ్రవరి 28: కొడిమ్యాల అటవీ రేంజ్ శాఖ పరిధిలో గల మల్యాల మండలం మద్దుట్లలో ఏర్పాటు చేసిన వెదురు బొంగు మొక్కల ప్లాంటేషన్‌ను బాసర జోన్‌కు చెందిన నిర్మల్- అటవీశాఖ సీసీఎఫ్ శరవణన్ అధికారుల బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క అటవీ శాఖ సిబ్బందిపై ఉందని అధికారుల బృందానికి సూచించారు. మద్దుట్ల అటవీ ప్రాంతంలో రెండు కిలోమీటర్ల మేర కాలినడకన క్షేత్రస్థాయిలో పర్యటించారు. సీడ్‌బాల్స్ ద్వారా మొక్కలను నాటడంతో పాటు ఎదిగిన చెట్లను కాపాడాలన్నారు. ఆయన వెంట జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు, కొడిమ్యాల రేంజర్ బుర్ర లత, మద్దుట్ల సెక్షన్ ఆఫీసర్ తోట రత్నమ్మ, బీట్ ఆఫీసర్ ప్రవీణ్, అటవీశాఖ బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల రూరల్ ఎంపీపీగా మహేశ్

● అర్బన్ ఎంపీపీ ఎన్నిక వాయిదా

జగిత్యాల రూరల్ ఎంపీపీగా ఎన్నికైన మంగళారపు మహేశ్

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 28: జగిత్యాల రూరల్ మండలం ఎంపీపీగా మంగళారపు మహేశ్ ఎన్నికయ్యారు. బుధవారం జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎన్నికల అధికారి మదన్‌మోహన్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. రూరల్ ఎంపీపీ స్థానం బీసీ జనరల్ కాగా గతంలో ఎంపీపీగా పనిచేసిన గాజర్ల గంగారాం గౌడ్ కరోనాతో మృతి చెందాడు. వైస్ ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్‌కు ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ప్రభుత్వం ఎంపీపీ ఎన్నికకు ఉత్తర్వులు జారీ చేయడంతో బుధవారం ఎన్నిక నిర్వహించారు. 15 మంది ఎంపీటీసీలుండగా, ఇందులో 9మంది బీఆర్ఎస్, ఐదుగురు కాంగ్రెస్, ఒకరు స్వతంత్ర అభ్యర్థి హాజరయ్యారు. రూరల్ ఎంపీపీ స్థానానికి ఒకే ఒక నామినేషన్ రావడం, పూర్తి స్థాయి కోరం ఉండడంతో మంగళారపు మహేశ్ ఎంపీపీగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు, సూపరింటెండెంట్ గంగాధర్ పాల్గొన్నారు. కాగా జగిత్యాల అర్బన్ ఎంపీపీ ఎన్నిక వాయిదా పడినట్లు డీఆర్డీవో (ఎన్నికల అధికారి) సంపత్ రావు తెలిపారు. జగిత్యాల అర్బన్ ఎంపీపీ ఎస్సీ రిజర్వేషన్ కాగా గతంలో ఎంపీపీగా పనిచేసిన ధరూర్ ఎంపీటీసీ మ్యాదరి వనిత కరోనాతో మృతి చెందారు. తిప్పన్నపేట ఎంపీటీసీ ములాసపు లక్ష్మి ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగారు. ఇటీవల ఎంపీపీ ఎన్నికకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, బుధవారం సమావేశానికి మోతె, తిప్పన్నపేట, హస్నాబాద్ ఎంపీటీసీలు హాజరయ్యారు. సమావేశంలో ఎస్సీ అభ్యర్థి లేకపోవడంతో ఎన్నికను వాయిదా వేశారు. కార్యక్రమంలో అర్బన్ ఎంపీడీవో విజయలక్ష్మి, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సారంగాపూర్/మెట్‌పల్లి రూరల్/కోరుట్ల/జగిత్యాల/మేడిపల్లి/మల్లాపూర్, ఫిబ్రవరి 28: బీర్‌పూర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేదసదస్సు కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గుట్టకింద స్వామివారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ఎంపీపీ రమేశ్, ఆలయ చైర్మన్ సామ్రాట్ గౌడ్, ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు. మల్లాపూర్ మండలం మొగిలిపేటలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో సీతారామాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. కోరుట్లలోని శ్రీసత్య అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో నాగేంద్ర సహిత మానసా దేవీ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా నాగవెళ్లి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భీమారం మండలం మన్నెగూడెంలోని ప్రభు రాజేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. కోరుట్లలోని కొత్త బస్టాండు రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో నరేంద్రశర్మ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని సుఖస్థలిలో శ్రీమద్‌భాగవత సప్తాహం ప్రారంభించారు. 53వ శ్రీమద్ భాగవత సప్తాహం నంబి వేణుగోపాలాచార్య కౌశిక (జగిత్యాల) ఆధ్వర్యంలో 9 రోజుల పాటు సాగే ప్రవచనం బుధవారం ప్రారంభించారు. వైదిక నిర్వాహణ నంబి నరసింహాచార్యులు (చిన్న స్వామి) ఆధ్వర్యంలో జిడిగే శ్రీనివాస్, గంప రమేశ్, ఉమ్మడి జిల్లా నుంచి 108 జంటలు పాల్గొన్నాయి. సారంగాపూర్ మండలంలోని రేచపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి బోనాలు నిర్వహించారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

కోరుట్ల, ఫిబ్రవరి 28: పట్టణంలో మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం పల్స్ పోలియో విజయవంతంపై మున్సిపల్, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇక్కడ ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్ అనిల్, హెల్త్ సూపర్‌వైజర్ ధనుంజయ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

ఖోఖో పోటీల్లో వినాయక్ ప్రతిభ

కోరుట్ల, ఫిబ్రవరి 28: పట్టణంలోని కల్లూరు రోడ్డులో ఉన్న టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల విద్యార్థి గుగులోత్ వినాయక్ జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపాడు. ఇటీవల జార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన 67వ జాతీయ స్కూల్ ఖోఖో పోటీల్లో వినాయక్ వెండి పతకాన్ని సాధించాడు. వినాయక్‌ను కళాశాల ప్రిన్సిపాల్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత, పీఈటీలు అజయ్, ప్రణయ్, ఉపాధ్యాయులు అభినందించారు.

పాత అలైన్‌మెంట్‌తోనే రోడ్డు విస్తరణ చేపట్టాలి

జగిత్యాల, ఫిబ్రవరి 28: నూతన అలైన్‌మెంట్‌తో నేషనల్ హైవే ఎన్‌హెచ్-63రహదారి విస్తరణ పనులు చేపట్టడం వల్ల భూములు కోల్పోతున్నామని, పాత అలైన్‌మెంట్ ప్రకారమే చేపట్టాలని అర్బన్, రూరల్ మండలంలోని కండ్లపల్లి, తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట్, పొలాస శివారు భూముల రైతులు, ప్రజలు పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. స్పందించిన సంజయ్‌కుమార్, అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే జగిత్యాల టాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగిత్యాలకు చెందిన మోయిజ్ ఎన్నిక కాగా ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యే మొయిజ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. వెంట కౌన్సిలర్ శివకేసరి బాబు, గంగమల్లు, జగదీశ్, పార్టీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు గట్టు సతీశ్, హొల్లెం మల్లేశం, నాయకుడు పోతున్క మహేశ్ ఉన్నారు.

రామ మందిరం నిర్మిస్తే రామరాజ్యం వచ్చినట్టా?

జగిత్యాల, ఫిబ్రవరి 28: దేవుడి పేరు చెప్పి ఓట్లు అడిగే నీచ సంస్కృతి బీజేపీదేనని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు బండ శంకర్ ఆరోపించారు. బుధవారం జగిత్యాల ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రామ మందిరం నిర్మిస్తే రామరాజ్యం వచ్చినట్టేనా, రామరాజ్యం దేశంలో ఉందా..? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని విమర్శించే స్థాయి బీజేపీ నాయకురాలు భోగ శ్రావణికి లేదని ఎద్దేవా చేశారు.

ఏడు మాంసం విక్రేతకు రిమాండ్

మేడిపల్లి, ఫిబ్రవరి 28: కథలాపూర్ మండలం చింతకుంటకు చెందిన వేముల లక్ష్మీరాజం ఏదు మాంసాన్ని గంభీర్‌పూర్‌లో విక్రయిస్తుండగా పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు డిప్యూటి రేంజ్ ఆఫీసర్ ముషీర్ బుధవారం తెలిపారు. ఇక్కడ ఫారెస్ట్ భీట్ ఆఫీసర్లు మధుసూదన్, ప్రదీప్ తదితరులు ఉన్నారు.

కత్తిపోట్ల కలకలం!

● తండ్రిపై కొడుకు హత్యాయత్నం

మెట్‌పల్లి, ఫిబ్రవరి 28: తండ్రిపై కొడుకు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆరపేటలో కలకలం రేపింది. ఎస్ఐ చిరంజీవి వివరాల ప్రకారం.. రిజ్వాన్‌ఖాన్‌కు ఇద్దరు కొడుకులు, ఐదుగురు కుమార్తెలున్నారు. చిన్న కొడుకు అక్బర్‌ఖాన్ తాగుడుకు బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. భర్త వేధింపులకు తాళలేక ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి రోజు తాగి వచ్చి తన భార్యను తీసుకురావాలని తల్లిదండ్రులతో గొడవపడుతున్నాడు. ఇదే విషయమై బుధవారం తండ్రితో వాగ్వాదానికి దిగి అక్బర్‌ఖాన్ కత్తితో రిజ్వాన్ కడుపులో పొడిచాడు. పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ రిజ్వాన్‌ఖాన్‌ను ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధితుడి పెద్దకొడుకు జుబేర్ ఖాన్ ఫిర్యాదు మేరకు అక్బర్‌ఖాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జోరందుకున్న పసుపు కొనుగోళ్లు

మెట్‌పల్లి, ఫిబ్రవరి 28: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపు కొనుగోళ్ల ప్రక్రియ జోరుగా సాగింది. 1094 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేశారు. పసుపు కాడి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.13,505, కనిష్ఠంగా రూ.4 వేలు, పసుపు గోళ క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.11,555, కనిష్ఠంగా రూ.4,056, పసుపు చూర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.11,555, కనిష్ఠంగా 4,052 ధర పలికింది. ఇప్పటి వరకు మార్కెట్‌లో 5,341 క్వింటాళ్ల పసుపు కొనుగోలు జరిగినట్లు మార్కెట్ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

● ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల నవజ్యోతి పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల, ఫిబ్రవరి 28: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, వైజ్ఞానిక రంగాల్లో రాణించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఆకాంక్షించారు. పట్టణంలోని నవజ్యోతి, శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సైన్స్ ఫేయిర్‌ను తిలకించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి దేశం గర్వించే సైంటిస్ట్‌లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, బీఆర్ఎస్ మైనార్టీ పట్టణాధ్యక్షుడు ఫహీం, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, సత్యం, పాఠశాల ప్రతినిధులు సుజాతాసుకుమారన్, బారీ, సెలీనా బారీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ

కోరుట్ల, ఫిబ్రవరి 28: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం బాధిత కుటు ంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నష్టపరిహారం చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అందజేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్‌కు చెందిన నడిపి రాజం కరెంట్ షాక్‌తో మృతి చెందగా రూ.5 లక్షల చెక్కును మృతుడి భార్య లక్ష్మికి అందజేశారు. వెంకటాపూర్‌లో వెంకట్రాములుకు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మృతిచెందగా రూ. 40 వేల చెక్కును బాధితుడికి అందించారు. ఇక్కడ ఎంపీపీ తోట నారాయణ, విద్యుత్ డీఈ తిరుపతి, ఏడీఈలు ఆంజనేయరావు, మనోహర్, ఏఈలు శ్రీనివాస్, సతీశ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

మల్లాపూర్, ఫిబ్రవరి 28: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన వెంకటేశ్(38) కొన్నేండ్ల క్రితం ఉపాధి కోసం కుటుంబ సభ్యులతో కలిసి కూలి పనులు చేసేందుకు రత్నాపూర్‌కు వలస వచ్చాడు. వెంకటేశ్ మద్యానికి బానిసయ్యాడు. కాగా తాగొద్దని భార్య, వెంకటేశ్‌ను మందలించడంతో బుధవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గంగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

గొల్లపల్లి, ఫిబ్రవరి 28 గొల్లపల్లి మోడల్ స్కూల్‌లో ప్రవేశం పొందడానికి దరఖాస్తు గడువును మార్చి 2 వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ తెలిపారు. ఆరోతరగతిలో 100 సీట్లకు, 7నుంచి10వ తరగతిలో ఖాళీ ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. దీనికి సంబంధించి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న ఉంటుందన్నారు.

ఎన్నికల నామినేషన్ల స్వీకరణ

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 28: మోహన్‌రావుపేటలోని గీతాపారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల నామినేషన్ స్వీకరణ బుధవారం ముగిసింది. ఈ మేరకు మొత్తం 146 ఓటర్లు ఉండగా తొమ్మిది డైరెక్టర్ల పదవులకు 19 మంది నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారులు మల్లేశ్, అశోక్‌కుమార్ తెలిపారు. కాగా 29న నామినేషన్ల పరిశీలన, 1న ఉపసంహరణ, 6న పోలింగ్ నిర్వహించి సాయంత్రం ఫలితాలను విడుదల చేసి నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

సంఘం బహిష్కరణపై కేసు

మెట్‌పల్లి, ఫిబ్రవరి 28: మెట్‌పల్లిలోని మోచీ సామాజిక సంఘంలో సంఘ బహిష్కరణ విధించిన ఘటనపై పలువురు సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి బుధవారం తెలిపారు. సంఘానికి సంబంధించిన ఆస్తులపై తమకు ఎలాంటి హక్కు లేదని, తమను సంఘం నుంచి బహిష్కరించి దూరం పెడుతున్నారని కావల్ల పెంటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

1 నుంచి జీరో బిల్లు

జగిత్యాల, ఫిబ్రవరి 28: మార్చి ఒకటి నుంచి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు జీరో బిల్ అందిస్తామని సూపరిటెండెంట్ ఇంజినీర్ సత్యనారాయణ తెలిపారు.నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలోగల జిల్లాలోని తెల్లరేషన్ కార్డు ఉన్న విద్యుత్ వినియోగదారులు అర్హులన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

కోరుట్ల, ఫిబ్రవరి 28: కొందరు వ్యక్తులు ఆర్డీవో కార్యాలయం పక్కన గల రహదారిని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డును మూసివేయడంతో ఇబ్బంది పడుతున్నామని గోదాం రోడ్డు కాలనీకి చెందిన కాలనీవాసులు కమిషనర్ తిరుపతికి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

పెగడపల్లి: నామాపూర్‌లో ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా సెక్టోరియల్ అధికారి మహేశ్

పెగడపల్లి/జగిత్యాల రూరల్/సారంగాపూర్/రాయికల్/మల్లాపూర్/ మేడిపల్లి/గొల్లపల్లి/ కోరుట్ల రూరల్/మెట్‌పల్లి రూరల్/కథలాపూర్, ఫిబ్రవరి 28: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పెగడపల్లి మండలం నామాపూర్ జడ్పీ పాఠశాలలో జిల్లా సెక్టోరియల్ అధికారి మహేశ్, జగిత్యాల బైపాస్ రోడ్‌లోని తపోవన్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ అనుమల్ల శ్యామ్, సారంగాపూర్ మండలం అర్పల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాల, మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక ఆశ్రమ పాఠశాలలో వైస్ ఎంపీపీ సురేందర్, రాయికల్‌లోని ప్రగతి హైస్కూల్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఇటిక్యాల మోడల్ స్కూల్, తాట్లవాయి, మూటపల్లి, ఇటిక్యాల జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. మల్లాపూర్‌లోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ అలీంమొద్దీన్, మేడిపల్లిలోని మోడల్ స్కూల్, జడ్పీ హైస్కూల్, కస్తూర్బా పాఠశాల, శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సైన్స్ ఫేయిర్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గొల్లపల్లి మండలంలోని దట్నూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జూపాక సుదర్శన్ ఆధ్వర్యంలోశ నేషనల్ సైన్సడే నిర్వహించారు. కోరుట్ల రూరల్ మండలం మాదాపూర్‌లో జడ్పీహెచ్ఎస్‌లో, మెట్‌పల్లి రూరల్ మండలంలోని వెల్లుల్ల జడ్పీహెచ్ఎస్‌లో, కథలాపూర్ మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులు గణితం, పర్యావరణం, సాంకేతిక రంగాలపై పలు ప్రదర్శనలు నిర్వహించారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

నడవలేని విద్యార్థిని ఎత్తుకొని హాలుకు తీసుకువెళ్తున్న మరో యువకుడు

జగిత్యాల టౌన్/సారంగాపూర్/కోరుట్ల/మారుతీనగర్/వెల్గటూర్/మల్యాల/ ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/గొల్లపల్లి, ఫిబ్రవరి 28: ఇంటర్ వార్షిక పరీక్షలో భాగంగా బుధవారం మొదటి సంవత్సరం పరీక్షకు 95.5 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు కలెక్టర్ షేక్ యాస్మి న్ భాష తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7,270 మందికి గానూ 6945 మంది పరీక్షకు హాజరు కాగా 325 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కొత్తబస్టాండ్ వద్ద గల ఆల్ఫోర్స్, పాత బస్టాండ్ వద్ద గల ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) లోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఇంటర్మీడియట్ నోడల్ అధికారి నారాయణ, తహసీల్దార్ రామ్మోహన్ ఉన్నారు. కాగా సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 82మందికి 75 మంది, బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 93 మందికి 89 మంది, మెట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 256 మందికి 249, ఆరోర జూనియర్ కళాశాలలో199 మందికి 191, సంకల్ప వొకేషనల్ జూనియర్ కళాశాలలో 154 మందికి 152, నరేంద్ర కో-ఆపరేటివ్ జూనియర్ కళాశాలలో 37మందికి 36 మంది, వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లిలోని మోడల్ స్కూల్‌లో 157 మందికి 151 మంది, మల్యాలలో 420 మందికి 413 మంది, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 237 మందికి 229 మంది, మల్లాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 201 మందికి 195 మంది, గొల్లపల్లిలోని పరీక్ష కేంద్రంలో 289 మందికి 285 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు తెలిపారు.

THE KARIMNAGAR DISTRICT COOPERATIVE CENTRAL BANK LTD., KARIMNAGAR
SIKHWADI, OPP-I-TOWN POLICE STATION, KARIMNAGAR-505001
Email: kdccbpremises@gmail.com, Our website: www.karimnagardccb.org
Contact: 9666408861, 7702700508, 7893645554
KDCCB

SHORT TENDER NOTICE

Office of The Karimnagar District Cooperative Central Bank Ltd., Karimnagar, invites sealed tender from Class-1 Contractors registered with State Government for the construction of Bank buildings in Erstwhile Karimnagar District at the following locations.

Sl.No.	Name of the Work	Location	Estimated Cost (in Lakhs)
1	Construction of Bank Building for Sultanabad Branch	Sultanabad (V), Sultanabad (M), Peddapalli District	83.14
2	Construction of Bank Building for Manthani Branch	Pejerukatta Area Locality , Manthani Municipality(MP), Peddapalli District	78.10
3	Construction of Bank Building for Bejjanki Branch	Bejjanki (V), Bejjanki (M), Siddipet District	65.95
4	Construction of Bank Building for Kamanpur Branch	Kamanpur (V), Kamanpur (M), Peddapalli District	79.13
5	Construction of Bank Building for Mallapur Branch	Mallapur (V), Mallapur (M), Jagityal District	66.12
6	Construction of Bank Building for Mutharam Branch	Mutharam (V), Manthani (M), Peddapalli District	63.88

The Tender document can be obtained from Deputy General Manager (Admin), The Karimnagar District Cooperative Central Bank Ltd., Karimnagar from 10:30AM of Dt:29/02/2024 to 01:00PM of Dt:06/03/2024. Tenders should be submitted before 03:00PM of Dt:06/03/2024.
Date of opening tenders is on Dt:06/03/2024 at 05:00PM

Date:28/02/2024
Sd/-
Chief Executive Officer